# కామాక్షి - కొత్తచీర

కెప్టెన్ షేక్ మౌలాలీ

కామాక్షి మనసు మంచిది .... చాల మంచిది. స్నేహితురాళ్ళంతా కొంచెం 'భోళా' మనిషి అని కూడా అంటారు. చదువులో ఫస్ట్ క్లాసులు రాకపోయినా మీడియమ్ స్టాండరులో ఓపట్టా పుచ్చుకుంది. ప్రక్కనే టైపు. షార్ట్ హ్యాండ్ కలుపుకొని ఓ పెద్ద కంపెనీలో ఓ చిన్న ఉద్యోగం సంపాయించి. ఆ తర్వాత ఓ మనసున్న "మనిషి"ని అతి నిరాడంబరంగా పెళ్ళి చేసుకుంది.

చేయి. చేయి కలిపితే "దోసిలి" అయినట్లు ఓ చిన్న యింట్లో ఆ నవ దంపతులు ముచ్చటైన కాపురం పెట్టి గుట్టుగా కాలం గడపసాగారు. వీధివారంతా వారిని చూసి "మంచి జంట" అనుకున్నారు.



ఓ ఆదివారం ఉదయం తలంటి పోసుకొని కురులు చిక్కు తీస్తున్న కామాక్షి చెవుల్లో వీధినుంచి ఓ మైకు పాట గింగురుమంది—"చీరగట్టి సింగారించి...." అర క్షణంలో పాట ఆగి వెంటనే ఓ దండకం వినవచ్చింది: "మహిళలకు శుభవార్త! నగరంలోని "సంతర్ మంతర్" ప్యాలెస్‌లో "అంతర్" గ్రూప్‌వారి చీరల ఎగ్జిబిషన్ జరుగుతూంది. వెల బజారు ధరలో మూడో వంతు మాత్రమే! తప్పక విచ్చేయండి.... మీకే తెలుస్తుంది...."

మైకు బండి ముందుకు సాగిపోయింది. కామాక్షి కళ్ళు మెరుస్తూ భర్తవైపు చూశాయి. తను నవ్వుముఖంతో తలాడించాడు. అంతే సాయంకాలం చల్లబడగానే "సంతర్ మంతర్" దారి పట్టింది.




ప్యాలెస్ లోపల అడుగు పెట్టింది కామాక్షి మిరుమిట్లు గొలిపే వెలుగులో జిగేల్ జిగేల్ మనే చీరలు!

చుట్టూ కలియ తిరిగింది.

"అబ్బ. ఎన్ని వెరయిటీలో!" అనుకుంది.

ఒక కౌంటర్ ముందు ఆగింది. కొన్ని చీరలు తిప్పి చూసింది.

"షోలెస్ చీరలమ్మగారూ!" అన్నాడు కౌంటర్ బోయ్.

కామాక్షి అర్థం కానట్లు అతని ముఖంకేసి చూసింది.

"షోలెస్ వెరైటీ అండీ! అంటే ఈ చీరలు ఎక్కువ చూడకుండానే కొంటారు. చాల మంచి వెరైటీ!" అన్నాడతను.

చీరలు కొన్ని తిరగేసి చూసింది. బాగానే వున్నవనిపించాయి.

ధర అడిగింది.

"నలభై అయిదు!" అన్నాడతను.

కామాక్షి ముఖంలో కొంత ఆశ్చర్యం చోటుచేసుకుంది.

అది గమనించి మరల అన్నాడతను— "నలభై అయిదు రూపాయిలమ్మగారూ! పోనీ నలభై వేసుకోండి. బజారులో నూట యాభయి ఉంది దీని ధర!"

నిజమే! బయట షోరూముల్లో అలాంటి చీరలు దాదాపు నూట యాభయి పలుకుతున్నాయి.

"ఇంత తక్కువ ధరకు మీకెలా గిట్టుబాటవుతుంది?" కుతూహలంగా అడిగింది.

"మాది కొత్తకంపెనీ అండీ! అడ్వర్టయిజుమెంటుకుగాను ముందుగా దేశవ్యాప్తంగా ఎగ్జిబిషన్లు పెట్టాము. రెండు నెలలు గడిస్తే మా కంపెనీ కూడ పాప్యులారిటీ అందుకుంటుంది. అప్పుడు ఈ చీర ఖరీదు కూడ నూటయాభయి తాకుతుంది. ప్రస్తుతం దాదాపు నష్టానికి అమ్ముతున్నామన్నమాట!" వివరించాడతను.

చివరకు తనకు బాగ నచ్చిన చీర సెలెక్ట్ చేసింది కామాక్షి— లేత గులాబీ రంగుపై పింక్ కలర్‌లో దాని పువ్వులు పరుచుకున్నాయి. థిక్ బ్రౌన్ కలర్‌లో మామిడిపిందెల బోర్డర్.

'సింపిల్ అండ్ అట్రాక్టివ్!' అనిపించింది.

మనీ కౌంటర్‌లో యాభయి రూపాయిల




నోటు యిచ్చింది. చీర ప్యాకెట్‌తోపాటు పదిరూపాయిలు తిరిగి యిచ్చాడతను.

ఇల్లు చేరిన కామాక్షి ఆ చీరను చాల మురిపెంగా మరోసారి చూసుకుంది. పండుగల కోసమని అట్టిపెట్టకుండ మరు రోజు ఆఫీసుకు కట్టుకెళ్ళింది. రెండు రోజుల తర్వాత ఆ చీరతోనే సినిమా చూసింది.

తిరిగి ఆదివారం వచ్చింది.

చీరను ఒకసారి నీళ్ళలో జాడిస్తే బావుంటుందనుకుంది కామాక్షి.

మిగతా బట్టలతోపాటు నానబెడితే వాటి మురికి, రంగు కొత్తచీర కంటుకుంటాయని వేరే బొక్కెనలో కొంచెం వాషింగ్ పౌడర్ వేసి నానబెట్టింది.

సరిగ్గా పావుగంట గడిచింది.

ముందుగా కొత్తచీర పిండి, ఆ నీళ్ళలో మిగతా బట్టలు పిండుదామనుకుంది. పెరట్లో నవ్వుతున్న తెల్లగులాబీల వైపు చూస్తూ బొక్కెనలో చెయ్యి పెట్టింది కామాక్షి.

ఆశ్చర్యం! చేతికి చీర తగల్లేదు.

'ఇంతలోనే ఏమయిందా!' అని బొక్కెనలోకి చూపు మరల్చింది.

షాక్ తిన్నట్లనిపించింది.

ఓ కొత్తరకంపాకంలాగా అనిపించింది. చేతితో దేవి చూసింది. సన్నని సేమ్యా తీగల్లాంటి దారాలు తేలియాడుతున్నాయి.

"పాయసం"లో (బొక్కెనలో) చేయి అట్లాగే ఉండిపోయింది. కళ్ళు కొంచెం బైర్లు కమ్మినట్లున్నాయి. అక్కడే కూర్చుంది కామాక్షి.

"ఎగ్జిబిషన్‌లో— బట్టలు తొందరపడి కొనరాదు" — లోగడ ఓ స్నేహితురాలు అన్నమాటలు లీలగా వినిపించసాగాయి. ●

